# దయ్యాలు

ఆటవులలో తిరిగిన ఆదిమానవుని అజ్ఞానం నశించి మేధాశక్తి క్రమవికాసం పొంది అతడు మానవాతీతమగు శక్తులను అవగతం చేసుకోగా, తత్ఫలితంగా ఏనాడు అతనికి దైవచింత ప్రారంభమైందో, ఆనాటినుంచే అతనికి దయ్యాల జిజ్ఞాసకూడా మొదలైంది. సృష్టిరహస్య పరిశోధనలో మనస్సు లగ్నంచేసిన ఫలితంగా అతనికి ప్రప్రథమంలో ప్రత్యక్షమైనవే పంచభూతాలు. పృథివ్యాపస్తేజో వాయురాకాశములైన ఆ పంచభూతాలను ప్రసన్నం కావించుకోడానికి అతడు పాటుపడినాడు. తర్వాతనే అతనికి తక్కిన దేవతలు తారసిల్లినారు. ఆ దేవతలతో పాటు దయ్యాలుకూడా మానవుని మనస్సును ఆవహించినవి. ఆవిధంగా ఆదిమానవునిలో రేగిన దయ్యాలచింత అతని సంతతివారైన మనకున్నూ సంక్రమించింది.

అందుకు నిదర్శనంగా దయ్యాలను గురించిన ఊహాలు, ఉద్దేశాలు, నమ్మకాలు, అపనమ్మకాలు, కథలు, కబుర్లు, సిద్ధాంతాలు, రాద్ధాంతాలు మనలో వుండనేవున్నాయి. దయ్యాలు దేవతలకు జనించిన చిల్లర దేవతలు (*Demi-Gods*) అన్న సిద్ధాంతం అందులో ఒకటి. "విద్యాధరోప్సరో యక్షో రక్షో గంధర్వ కిన్నరాః । పిశాచో గుహ్యక స్సిద్ధో భూతోమీ దేవయోనయః" అనే అమరశ్లోకమే దీనికి తార్కాణం. "ఉత్తిష్ఠంతు భూత పిశాచాః" అనే భూతోచ్చాటన మంత్రం జపించి, తర్వాత సంధ్యావందనం ప్రారంభించడం కూడా దయ్యాల వునికికి దాఖలా చేసుకోదగిన సాక్ష్యం. "గదేఒక నిస్పర్శన విస్ఫులింగే - విష్ఫుళ్లి నిష్పిణ్డ్యి జితప్రయాసి, కూశ్మాణ్డ వైనాయక యక్షరక్షో భూత గ్రహాం శ్చూర్ణయ చూర్ణయారీన్" అనే నారాయణ కవచ శ్లోకం చూస్తే మనకు దయ్యాల భయం ఎంతవుందో బోధపడుతుంది. "దైవము" అనే పదమే "దయ్యము" గా మారిందని భాషాపరిణామ శాస్త్ర్ర పారంగతులు భావిస్తారు. "పినుసిగ దయ్యంబు" "గాలిదయ్య మపు డంతర్ధాన మై పోయె" అన్న కవిప్రయోగాలు కలవు. "బ్రహ్మ రాక్షసకోట్ల పారద్రోలగవచ్చు" అనే నమ్మకంతో నరసింహ స్మరణచేస్తాము. "ఇది శ్మశానములతో నిటలేక్షణుండు గజ్జె గదలించి యాడు రంగస్థలంబు" అని జాషువకవి అన్నాడు. ఆ కవే, మరొక సందర్భంలో "జడలెదయ్యాల పగిది" అని వర్ణిస్తూ మరో క్రొత్తరకం దయ్యాన్ని చూపినాడు. "శాకినీ ఢాకినీ గాలిదయ్యంబులన్ నీదు వాలంబునం జుట్టి, నేలం బడంగొట్టి" అనే ఆంజనేయ దండకంలోని భాగం దయ్యాలలోని మరికొన్ని తెగలను గూర్చి తెలుపుతుంది. సావధానంగా యోచిస్తే గాలికీ దయ్యానికీ ఏదో అవినా

‘చదలవాడ’

భావ సంబంధం వుండేటట్లే తోస్తుంది. కాబట్టి దయ్యాల కబుర్లను "గాలి కబుర్ల" క్రింద జమకట్టడానికి వీలుకాదు. అసలు "గాలి" అంటేనే దయ్యానికి పర్యాయపదం. గాలి (*air*) లేకుంటే ప్రాణం పోతుంది సాధారణ పరిస్థితుల్లో. అసాధారణ పరిస్థితులలో "గాలి" సోకితే ప్రాణాపాయం కలిగేదీ తప్పదు. కాబట్టి మామూలు గాలికీ, మనం భయపడే "గాలి"కీ వ్యత్యాసాలు, సంబంధ బాంధవ్యాలు ఏమిటో పెద్దలనే అడగాలి. ఆ విషయాలు వారే గాలించాలి.

త్రిమూర్తులలో నొకడగు శివుడు "భూతేశుడు" (భూతేశః ఖండపరశు - ఇత్యమరః) అతని అనుచరులు భూతగణాలు. అతని కుమారుడైన విఘ్నేశ్వరుడు భూతగణాధిపతి. (గజాననం భూతగణాదిసేవితం)

మృత్యనంతరం జీవి యాతనాశరీరంతో తనుచేసిన పాప ఫలం అనుభవిస్తాడని మనమతం అంటుంది. *God the Father, God the Son* తో పాటు *Holy Ghost* కూడా క్రైస్తవ సిద్ధాంతరీత్యా పూజనీయమే. మరణించినవారి తాలూకు దయ్యాలు భగవత్సాన్నిధ్యంలో పుణ్యపాప విచారణ జరిగే రోజైన *Dooms Day* కు గాను వేచియుండునని వారి విశ్వాసం. షేక్స్పియరు కవి తననాటకాలలో దయ్యాలనుకూడా ప్రవేశపెట్టినాడు. ప్రతాపరుద్రీయంలో ఒక చిన్న అంతర్నాటకం వస్తుంది. అందులో యుగంధరుడు ఖుమ్రా దయ్యాన్ని ప్రవేశపెట్టించి ఒక చిన్న నాటకం (నిజానికి బూటకం) ఆడించి సుల్తానుకు గిలి పుట్టిస్తాడు.

ఉర్దూలో "సైతాన్" అంటే దయ్యం అని అర్థం. వారు ఒకర్నొకరు "సైతాన్" అని తిట్టుకొంటారుకూడా. కేశసంస్కారం లేక చింపిరితలతో తిరిగేవారిని "చింపిరి దయ్యం" అంటాము. ఇదీ ఒక తెగ కావచ్చు. మాకొక డ్రాయింగు టీచరుండేవారు. "ఒకే కుంటిదయ్యం!" అని తిట్టడం ఆయనకి మామూలు. అందంగా బొమ్మలు గీయలేనివారు "దయ్యాలైపుట్టి మొర్రో వానదేవుడా" అని తిరుగుతారని ఆయన భయపెట్టేవారు. అప్పటికీ దయ్యాలవంటి బొమ్మలు గీచి ఆయన్ని భయపెట్టేవారు పిల్లలు. ఆ తరగతిలోనే ఒక వైష్ణవుల అబ్బాయి వుండేవాడు. వాడిపేరు వరదయ్యంగారు. వాడికి "కుంటిదయ్యంతో పాటు "వరదయ్యం" గారు అని కూడా ఆ కొంటె మాస్టారు నామకరణం చేశారు. ఇంకో మిత్రవర్యుడు తన భార్యను గారాబంగా "దెయ్యం!"అని పిలవడం అలవాటు.

ముస్లిముల "సైతాన్" లాగే మళయాళంలో "శాతాన్" వుంది. అదే అరవదేశంలో "కుట్టి శాతాన్" (పిల్లదయ్యం) అయింది. *Between the Devil and the Deep sea* అనే ఆంగ్ల ప్రయోగం కద్దు. సాహసవంతులను "*Dare-devil*"అంటారు. అహోరాత్రాలు కష్టపడి పట్టుదలతో పని చేసేవారికి "*He works Like a devil*" అని యోగ్యతా పత్రం యిస్తాము. *Idle-man's brain is a devil's work-shop*" అని సోమరిపోతులను హెచ్చరిస్తాము. "*Devil quotes the scriptures for its own Purpose*" అనే మరొక సామెత కూడా ఆంగ్లంలో వుంది. పెదవి, ఆకార పుష్టిగల వస్తువులనుగురించి *Giant Size* అని వర్ణిస్తారు. అసాధారణ మేధాశాలిని *Intellectual Giant* అని పోలుస్తాము.

వివిధ దేశాల ఆటవికనృత్యాలలో *Devil Dance* అనే పైశాచీనృత్యం ఉంది. బృహత్కథ పైశాచీభాషలో చెప్పబడింది. "చచ్చి దయ్యమై తగులుకుంటాను" అన్న మాట మనకు క్రొత్తగాదు. "డబ్బుకు దెయ్యం

కూడా భయపడుతుంది" అని కొందరి నమ్మకం. అయితే వారెన్ని దయ్యాలను దెబ్బకొట్టినారో చెప్పలేము. "నిన్ను పట్టిన దయ్యం వదిలిస్తాను" అని కొందరు బెదిరిస్తారు. "అనుమానం పెనుభూతం" అని దయ్యాలనుగురించి కొందరినిర్వచనం. "నిత్యశంకితులు పరభాగ్యోపజీవివర్గరాలు దుఃఖభాజనులు" అన్న చిన్నయసూరి వాక్యం. అందులో దయ్యాలను గురించి "అనుమానం" మాత్రం పనికిరాదు. "వాడు కాకుంటే, వాడిని పట్టిన దయ్యం" అని కొందరు వాదిస్తారు.

జ్యోతిషశాస్త్రరీత్యా, జన్మనక్షత్రముల ననుసరించి మనలో దేవ, మనుష్య రాక్షసగణాలుగా విభజించేది కద్దు. అందులో కొందరికి దయ్యాలు కనబడును, మరికొందరికి కనబడవు అని కొందరి సిద్ధాంతం. ఈ సిద్ధాంతంమీద ఆధారపడే కొందరు దయ్యాలను ప్రత్యక్షంగా చూచినట్లు, మాట్లాడినట్లు, పనులు చేయించుకొన్నట్లు చెప్పడం మామూలు. వీరి మాటల్లో ఉత్ప్రేక్ష, అతిశయోక్తి - ఇత్యాద్యలంకారాలకు చేయవలసిన మినహాయింపులు చేసి విచారించి చూస్తే వీసమెత్తు నిజమైనా లేకపోదు. ఆంధ్రులకు చిరపరిచితమైన "పింగళివారి పేకి" కథ దీనికి చక్కని ఉదాహరణం. బాలనాగమ్మ కథలోని మాయల మరాఠీకి చాకల దయ్యాలు, మంగల దయ్యాలు చాకిరీ చేయడం చూస్తే దయ్యాలలో కూడా కులవ్యత్యాసాలు కలవని తేలుతుంది. ఇవిగాక అల్లావుద్దీన్ (*Alladin and the wonderful lamp*) కథలో, భట్టివిక్రమార్కుల కథలలో, జాతక కథలలో దయ్యాల నేకం వస్తాయి.

భూతవైద్యం అనే మంత్రశాస్త్ర సంబంధమైన చికిత్సా విధానం ఒకటుంది. ఆ విద్యలో ఆరితేరినవారు అసలే భయభ్రాంతులైన అమాయికుల కంట్లో దుమ్ము కొట్టి (విభూతి మంత్రించి) డబ్బు గుంజుకోవడానికి ఎన్నో ఎత్తులు - అసగా తా ఎత్తులు వేస్తారు. వీరు గిరిగీచి గిరిలోకి దయ్యాన్ని రప్పించి, దాని పుట్టు పూర్వోత్తరాలు విచారించి, వీడిపొమ్మని శాసించి, సత్యం చేయించుకొని, ఆవిధంగా పొయ్యే దానికి నిదర్శనాలు చూపి పొమ్మంటారు. ఆ దయ్యం ఫలానా దిక్కులో, కొండొక వృక్షం తాలూకు కొనకొమ్మను విరిచి పోతానని, ఫలానా పాడుబావిలో బండ వేసి పోతానని చెప్పి, చెప్పినంత పని చేసి పోతుంది. దీనిమూలంగా సత్యానికి కట్టుపడే విషయంలో మనకన్నా దయ్యాలే మేలని తోస్తుంది.

ఈ రాయివేసి పోవడాన్ని పురస్కరించుకొనే, "పోర పిశాశి కల్లు తూక్కి పోట్టు పోచ్చి" అనే అరవసామెత పుట్టింది. "పే యానాలుం తాయ్" అన్న తమిళ సామెత కూడా వుంది. దయ్యమైనా కూడా, తల్లిమాత్రం తల్లే - అని మాతృహృదయాన్ని సూచిస్తుంది ఈ సామెత. "పిణ్ణై కండాల్ పేయుం ఇరంగుం" అనే సామెతకూడా కద్దు. కఠిన హృదయంకూడా స్త్రీని చూస్తే కరిగిపోతుంది అని దీని భావం.

ఒకానొక చోళరాజును బ్రహ్మహత్యా పిశాచం వెంటబడి వేధించుకు తినడం ప్రారంభించింది. ఆ బాధ భరించలేక శివభక్తుడైన ఆ భూపతి భూతపతిని ప్రార్థించినాడు. భూతగణాలలో నొకటి భక్తగణాలలోని ఒకరిని బాధపెట్టడం భావ్యం కాదని భవానీ భర్త రాజుకు స్వప్నంలో సాక్షాత్కరించి, తిరువడ మరుదూరులోని తన ఆలయంలోనికి వచ్చి పూజచేసి, వేరే ద్వారంగుండా తప్పించుకుపొమ్మని తరణోపాయం చెప్పినాడట. ఉమాపతి చెప్పిన ఉపాయం ప్రకారం రాజమార్గంలో ఆలయం ప్రవేశించిన రాజు సందు దారిలో పసందుగా తప్పించుకున్నాడు. ఆనాడు ఆలయం వాకిట్లో ఒక గూట్లో ప్రతిమారూపంతో రాజు రాకకు ఎదురుచూచిన ఆ బ్రహ్మహత్యా పిశాచం నేటికీ శిలారూపంతో, తిరువడ మరుదూరులోని శివాలయ ప్రాంగణంలో కనబడుతుంది. ఆలయంలోకి ఆ దారిని ప్రవేశించి అందరూ మరొక దారిగుండా ఇండ్లకుపోవడం ఇప్పటికీ అక్కడి ఆచారం. ఈవిధంగా ఆ గాధ శిలాశాశ్వతమైన ఫలితంగా తమిళ సోదరులు ఇతరులను పీడించేవారిని "చోళ బ్రహ్మత్య" అని దూషిస్తారు నేటికీ.

కొన్ని క్షేత్రాలలో దేవతా సాన్నిధ్యంలో సేవచేస్తే ఆవహించిన దయ్యాలు భూతాలూ అవే వదిలిపోవునే నమ్మకంతో ఆయా క్షేత్రాలకు పిశాచాది దుష్టగ్రహపీడితులు వెళ్ళడం కద్దు. అట్టివి దక్షిణాదిని గుణశేఖరం, తెలుగునాడు చోళింగపురము అనేవి.

వేదవేదాంగాలు, సమస్తశాస్త్రపురాణేతిహాసాలు చదివిన పండితుడు శాపవశాత్తు బ్రహ్మరాక్షసుడై, శాపవిమోచనానంతరం నిజరూపం పొందడం మొదలైన కథలు ఎన్నో వున్నవి. తులసీదాసుకు ఒక బ్రహ్మరాక్షసుడు ప్రత్యక్షమై, మాయా బ్రహ్మచారి రూపంలో, భక్తి పారవశ్యంతో, బాష్పపూరిత నేత్రాలతో రామాయణ కథా కాలక్షేపం వినే ఆంజనేయులవారి ఆచూకీ తెలిపినాడు. "యత్ర యత్ర రఘునాథకీర్తనం - తత్ర తత్ర కృతమస్తకాంజలిం - బాష్పవారి పరిపూర్ణలోచనం - మారుతిం నమత రాక్షసాంతకం" అన్న శ్లోకం మననంచేసి అందులో నిజానిజాలు కనుగొన్న పండితుడేమో ఆ బ్రహ్మరాక్షసుడు! ఒకసారి కాళిదాసు "మత్సరపూర్ణమతులైన" పండితుల కుట్ర ఫలితంగా బ్రహ్మరాక్షస నివాసమైన ఒక భవనంలోకి పంపబడినాడు. వచ్చినవారిని చిక్కు ప్రశ్నలు వేసి సరైన సమాధాలు రాకుంటే చంపేవాడట ఆ బ్రహ్మరాక్షసుడు. కాని కాళిదాస మహాకవి మేలైన సమాధానాలు చెప్పి మెప్పులుపొంది వచ్చాడు. భారతం చదివిన ప్రతివారికీ యక్షప్రశ్నలంటే తెలుసుంది. యక్షప్రశ్నలకు దక్షతతో సమాధానం చెప్పి నిక్షేపంవంటి తమ్ముళ్ళ ప్రాణాలు నిలుపుకొన్నాడు ధర్మరాజు.

గారడి, వింతలు, వినోదాలు చేసిచూపి కుక్షి నింపుకునేవారికి "యక్షిణి" వశమై యుంటుంది. కర్ణపిశాచిని వశీకరణం చేసుకొన్నవారు కవరులో వచ్చిన ప్రశ్నలకు కవరు చింపకనే ప్రత్యుత్తరాలు పంపిస్తారు. కవరులోని ఏ ప్రశ్నకైనా Cover అయ్యేటట్లు సమాధానం ఆ కర్ణపిశాచి చెప్పడంవల్లనే కవరు చింపవలసిన ప్రమేయం వారికి కలుగదు. ఇవిగాక, మోహిని, కొరివిదయ్యం - ఇత్యాది నామాంతరాలతో ఎన్నో దయ్యాలు, భూతాలనుగూర్చి వింటూంటాము.

కొన్ని దేవతల పేర్లు, వాని రూపకల్పన, పూజావిధానాలు చూస్తే మన ఆధ్యాత్మికచింత ఒకరకమైన భూతోపాసనతోనే ప్రారంభమై తర్వాత వృద్ధిపొందిందనిపిస్తుంది. ఈనాటికి కూడా, మునీశ్వరుడు, చెంచువాడు, కన్నెకలు మొదలైన దేవతలను కొలిచే ఆచారం మనలో నిలిచి వుండడమే దీనికి నిదర్శనం. వివాహాది శుభకార్యాలు తలపెట్టినపుడు పై దేవతల ఆరాధనలు మొదట జరగడం, పిల్లలకు ఈ కులదేవతల పేర్లే పెట్టడం నేటికీ మామూలే. మునిరత్నం, కన్నెమ్మ, చెంచురామయ్య, చెంచమ్మ, భేతాళరావు మొదలైన పేర్లు ఇందుకు నిదర్శనం. గతించిన ముత్తైదువలు, బ్రహ్మచారులు, కన్నెపడుచులు మన యిండ్లలో దేవతా సమానంగా పూజింపబడతారు. వారి పేరమీదుగా వస్త్రదానం చేయడం, వారి పేర్లు బిడ్డలకు పెట్టడం మనకు తెలిసిన విషయం.

భూతాలంటే మనం భయపడనక్కరలేదు. "భూతము" అన్న మాటకు ప్రాణి లేక జీవము అనే అర్థం. కాబట్టి భూతాలంటే పిపీలికాది బ్రహ్మపర్యంతంగల

(55-వ పేజీ చూడండి)

# విజ్ఞానవీధులు

"డాక్టర్"

## 191. సూర్యకేంద్ర సిద్ధాంతం అంటే ఏమిటి?


సూర్యునిచుట్టు భూమ్యాది గ్రహాలు తిరుగుచున్నాయనే సిద్ధాంతమే సూర్య కేంద్ర సిద్ధాంతము.

సూర్యుడు గ్రహాలు నక్షత్రాలు వంటి నభోమూర్తులు భూమిచుట్టు తిరుగుచున్నట్లు కనపడతాయి. అది కేవలం అభాసయేయైనా కంటికి ప్రత్యక్షంగా కనిపిస్తున్నది కాబట్టి అదే నిజమని చాలకాలం ప్రజలు నమ్మేరు. నమ్మడమే కాదు; భూమిచుట్టు సూర్యాది సమస్త నభోమూర్తులు ప్రదక్షిణం చేస్తున్నాయని సిద్ధాంతంకూడా చేసేరు. అదే భూకేంద్ర సిద్ధాంతం.

ఏ సిద్ధాంతమైనా సరే, ప్రత్యక్ష అవేక్షణా ఫలితాలతో సమన్వయం పొందినపుడే అది సత్యమైనదిగా పరిగణింపబడుతుంది. భూకేంద్ర సిద్ధాంతం విషయంలో కూడా అంతేనని వేరే చెప్పనక్కరలేదు. భూకేంద్ర సిద్ధాంతరీత్యా గుణించిన గ్రహాల స్థానాలతో ప్రత్యక్షంగా అవేక్షించిన కొన్ని గ్రహాల స్థానాలు సమన్వయం పొందేవికావు. అందుచేత భూకేంద్ర సిద్ధాంతం తప్పని క్రమంగా శాస్త్రజ్ఞులు గ్రహించి దాని స్థానే సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని (*Heleocentric theory*) ప్రతిష్ఠించేరు.

సూర్యకేంద్ర సిద్ధాంత ప్రతిష్ఠాపన గౌరవాన్ని నికలాస్ కోపర్నికస్ (1478-1548) అనే పోలండ్ దేశ ఖగోళ విజ్ఞానికి సాధారణంగా కట్టబెట్టుతారు. భారతీయ జ్యోతిశ్శాస్త్రజ్ఞుడు ఆర్యభట్టు, పాశ్చాత్య ఖగోళ విజ్ఞాని అరిస్టార్కస్ ప్రభృతులనేకులు అట్టి సిద్ధాంతాన్ని అంతకుముందే ప్రతిపాదించియున్నారు. దానిని కోపర్నికస్ పునరుద్ధరించినాడు. సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని కోపర్నికస్ లేవనెత్తిన పిమ్మట మరల భూకేంద్ర సిద్ధాంతము తల యెత్తలేదు.

కోపర్నికస్ సూర్యకేంద్ర సిద్ధాంతం ప్రకారం సూర్యుడు విశ్వకేంద్ర స్థానంలో స్థిరంగా ఉన్నాడు. ఆయన చుట్టు బుధుడు, శుక్రుడు, భూమి, కుజుడు, గురుడు, శని గ్రహాలు తమతమ నియమిత కక్ష్యలలో ప్రదక్షిణం చేస్తున్నాయి. చంద్రుడు భూమిచుట్టు తిరుగుచు భూమితో కలిసి సూర్యునిచుట్టు తిరుగుతున్నాడు.




ఇక శనిగ్రహ కక్ష్యకు అవతల బహు దూరంలో, విశ్వాన్నంతను తనలో ఇముడ్చుకొన్న దానివలె నక్షత్ర యుక్తమైన గోళమున్నది. అది స్థిరమైనది. (మూడు వటము) గ్రహాల కక్ష్యలు వృత్తాల సమ్మేళనంచే ఏర్పడిన *Epicycle* ఆకారంలో ఉంటాయి. ఈ కక్ష్యల కేంద్రము దుగాక కొంచెము ప్రక్కగా సూర్యుడుంటాడు.

ఆధునిక శాస్త్రదృష్ట్యా కోపర్నికస్ సూర్యకేంద్ర సిద్ధాంతము కూడా సమగ్రమైనదికాదు; లోపరహితమైనదీ కాదు. భూకేంద్ర సిద్ధాంతములో భూమి కేర్పడిన అధికతర ప్రాముఖ్యాని కిందు తావులేక పోయింది. సూర్యకుటుంబానికి సంబంధించి ఎంత వరకు ఆ సిద్ధాంతాన్ని పరిమితంచేస్తే, కొంతవరకు సత్యమైనదానినిగా దానిని పరిగణింపవచ్చును. —అనంత్ ★

## దయ్యాలు

(11-వ పేజీ తరువాయి)

సమస్త జీవరాసులూను. అన్ని జీవకోట్లున్నూ "విశ్వం విష్ణుర్వషట్కారో, భూతభవ్య భవత్ప్రభుః। భూతకృద్భూత భృద్భావో భూతాత్మా భూతభావనః॥ ఏకో విష్ణు మహద్భూతం - పృథగ్భూతాన్య సంశయః। త్రీన్లోకాన్ వ్యాప్య భూతాత్మా" అని స్తుతింపబడే సర్వేశ్వరాంశా సంభూతాలే.

"తనయందు నఖిలభూతములందు నొక భంగి సమహితత్వంబున" సదా ప్రవర్తించవలెనన్నది భాగవతోక్తి. అటువంటి భూత దయను ప్రచారం కలిగించడానికే భగవంతుడు బుద్ధావతారం ధరించినాడు. ఆ దివ్యమూర్తి "అహింసా పరమోధర్మః" అనే సర్వమత సమ్మతమైన సత్యాన్ని చాటి ప్రపంచానికి శాంతిసందేశం వినిపించాడు. ఆయన సూత్రాలు పాటించే సంఘమే సత్సంఘం. ఆయన, ఆయన ఉపదేశం - ఆ యుపదేశాలను ఆచరించి ప్రచారం చేసే సంఘం - ఇవే త్రిశరణములు.

బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి. ★